ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G), రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.

WWW.GAYATHRINEWS.COM

# గాయత్రి న్యూస్

APTEL/26/A3646

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ శనివారం 30-05-2026 సంపుటి : 1 సంచిక :06 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-

## పెట్టుబడుల ఆకర్షణలో... తమిళనాడుకు ఏపీ పోటీనిస్తుంది

**పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ కచ్చితంగా తమిళనాడుకు ఆరోగ్యకరమైన పోటీ ఇస్తుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.**



పెట్టుబడిదారులను ఉద్దేశించి తమిళనాడు పరిశ్రమల శాఖ మంత్రి కీర్తన మాట్లాడిన వీడియోను ట్యాగ్ చేశారు. 'పెట్టుబడులను రాబట్టడంలో చొరవ చూపుతున్న మిమ్మల్ని అభినందిస్తున్నా.ప్రతి మంత్రీ తమ రాష్ట్రాన్ని మార్కెటింగ్ చేసుకోవడంపై దృష్టి పెట్టాలి. పెట్టుబడిదారులతో చర్చలు జరపడం, ఉపాధి కల్పించే వారిలో నమ్మకాన్ని పెంపొందించడం చాలా అవసరం. దేశ అభివృద్ధిని వేగవంతం చేయడంలో రాష్ట్రాలు చొరవ చూపడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ కూడా ప్రోత్సహిస్తారు' అని లోకేశ్ పేర్కొన్నారు. లోకేశ్ పోస్టుకు కీర్తన స్పందించారు.

## రాహుల్‌తో షర్మిల భేటీ... రాజ్యసభ సీటు కోసమేనా?



కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల భేటీ అయ్యారు. ఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పాల్గొన్నారు. షర్మిల కర్ణాటక నుంచి రాజ్యసభ సీటు కోరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. త్వరలో అక్కడ రాజ్యసభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఆమె రాహుల్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతంతో పాటు వివిధ అంశాలపై రాహుల్‌గాంధీ పలు సూచనలు చేసినట్లు షర్మిల 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

## జల వివాదాల పరిష్కారానికి సహకరించుకోండి

**- కెన్-బెట్వాను ఆదర్శంగా తీసుకోండి**
**- రాష్ట్రాలకు ప్రధాని మోదీ సూచన**



## జగన్.. ఈసారి మీకు ఆ ఛాన్స్ ఇవ్వం



### సీఐఏనే దోచిన ఘనుడు: మాజీ అధికారి ఇంట 300 కిలోల బంగారం



అమెరికా గూఢచర్య సంస్థ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ) ప్రపంచంలోనే పెద్ద పెద్ద దేశాధినేతలనే బోల్తాకొట్టించి నిఘా సమాచారం సేకరిస్తుంది. అలాంటి సంస్థనే దోచేశాడు దాని మాజీ అధికారి ఒకరు. అతడి ఇంట బంగారం ఖజానా చూసి ఎఫ్‌బీఐ సిబ్బంది అవాక్కయ్యారు.

### గాలివాన బీభత్సం.. విద్యుత్ సరఫరా పునరుద్ధరణపై మంత్రి సమీక్ష



రాత్రి నుంచి పలుచోట్ల వర్షం, ఈదురుగాలుల వల్ల వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తాయని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఉమ్మడి కృష్ణా, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో కొన్నిచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. వర్షం కారణంగా కొన్నిచోట్ల విద్యుత్ పునరుద్ధరణకు ఆలస్యమవుతోందన్నారు. మధ్యాహ్నంలోగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అధికారులను మంత్రి గొట్టిపాటి ఆదేశించారు.


## పారిశ్రామిక కాలుష్య నివారణకు నిరంతర తనిఖీలు చేయాలి

**'స్వచ్ఛ గోదావరి- పవిత్ర పుష్కరాల' నేపథ్యంలో అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు ఇచ్చారు**

కాలుష్యరహిత గోదావరి, పుష్కరాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఆరు జిల్లాల్లో 262 పుష్కర పంచాయతీలను గుర్తించారు. మురుగురహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. మురుగు నీరు నేరుగా గోదావరిలో కలవకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. మున్సిపాలిటీ సామర్థ్యానికి తగిన విధంగా మురుగు శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. పీసీబీ మంజూరు చేసిన రూ.100 కోట్ల నుంచి కూడా నిధుల వినియోగించాలని ఆదేశించారు.



## రిజర్వ్ చేసిన మూడు నెలల్లో తీర్పులివ్వండి: హైకోర్టులకు 'సుప్రీం' ఆదేశాలు



**టాయిలెట్‌లో పాత్రల్ని కడగడంపై ఐఆర్‌సీటీసీకి నోటీసు**

వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశాల్లో 3 నెలల కంటే ముందే తీర్పులను ఆశిస్తున్నాం. బెయిల్ దరఖాస్తులపై అదే రోజు తీర్పులు ప్రకటించడం ఆదర్శనీయమని.. ఒక వేళ తీర్పు రిజర్వు చేస్తే మర్నాడే దానిని వెలువరించాలి.

బెయిల్‌పై తీర్పు వెలువడిన రోజునే జైలు అధికారులకు ఆర్డర్లను వెంటనే పంపించాలి. విచారణలోని ఖైదీలను బెయిల్ లభించిన అదే రోజున.. లేకపోతే మరుసటి రోజున విడుదల చేసేయాలి.

### తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై సుప్రీంలో విచారణ



తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై అమీర్ అలీఖాన్, అజారుద్దీన్ దాఖలు చేసిన ఇంటర్‌లోకేటరీ అప్లికేషన్లపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. కేసు విచారణ జులై 22న చేపట్టనున్నట్లు ఇప్పటికే ప్రకటించామని ధర్మాసనం తెలిపింది.

# ఈ నెల 30 న అమృతలూరులో శ్రీ అమృతేశ్వరస్వామి ఆలయ మాగాణి భూమి కౌలుకు బహిరంగ వేలం

గాయత్రి న్యూస్

బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం మండల కేంద్రం అమృతలూరు లోని శ్రీ అమృతేశ్వర స్వామి దేవస్థానంలో హక్కుభుక్తములు గల మాగాణి భూమిని ఈనెల 30వ తేదీ శనివారం దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో 2026 - 27 నుండి 2028 - 29 కి మూడు సంవత్సరములు కౌలు చేసుకునే హక్కుకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి,ఎన్. శివరామకృష్ణ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ అమృతేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి 194 - 1,2 సర్వే నెంబర్ లో గల య 4.50 సెంట్లు మాగాణి భూమి, రైతులు మూడు సంవత్సరాలు కౌలు చేసుకునే హక్కు కొరకు శ్రీ అమృతేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం పాట నిర్వహించబడుతుందన్నారు.ఈ బహిరంగ వేలం పాట ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం,దేవాదాయ శాఖ అధికారుల ఉత్తర్వులకు లోబడి కౌలు వేలం పాట జరుగుతుందన్నారు.పాటలో పాల్గొనేవారు పదివేల రూపాయలు ధరావత్తు చెల్లించి పాటలు పాల్గొనాలన్నారు. దేవస్థానం భూమి పాట జరిగిన వెంటనే హెచ్చు పాట దారుడు పాట మొత్తం చెల్లించి రసీదు పొందాలన్నారు.లేని ఎడల పాటను రద్దుపరిచి,తిరిగి పాట పెట్టబడునని వివరించారు.కౌలుదారుడు ప్రతి సంవత్సరం మే 5 లోపు కౌలు చెల్లించి భూమిలో ప్రవేశించాలన్నారు.అట్లు చెల్లించని ఎడల మరల పాట పెట్టబడును తెలిపారు.దేవస్థానం వారు పాట ఖాయపరిచినట్లు తెలియపరిచిన వెంటనే దేవస్థానం ఇచ్చిన ముసాయిదా ప్రకారం తగు హామీతో కౌలు రిజిస్టర్ తమ సొంత ఖర్చులతో చేయించుకోవాలన్నారు.కౌలు భూమి వ్యవసాయానికి మాత్రమే ఉపయోగించాలని,మట్టి బయటకు తోల రాదని,వ్యాపార పంటలకు ఉపయోగించరాదని, సర్కారుశిస్తులను దేవస్థానం వారు చెల్లిస్తారని,అపరాదరుసుములు రైతులే భరించాలన్నారు. తివృష్టి,అనావృష్టి,ప్రకృతి వైపరీత్యాలు వలన సంభవించినష్టములు,కాలువల ద్వారా నీరు వచ్చిన రాకపోయినాను దేవస్థానం వారికి ఎటువంటి బాధ్యత ఉండదు,అందువలన జరుగు నష్టము హెచ్చు పాట దారుడు



భరించాలన్నారు.భూమి మంచి చెడ్డలు ముందుగా చూసుకొని ఎటువంటి పేచీలు పెట్టరాదని, భూమి యొక్క హెచ్చుతగ్గులలో ఎటువంటి పేచీలు పెట్టరాదని, ఒకవేళ కౌలు భూములలో పంట సంజీవిని కొరకు పాంపౌండ్స్ తీసిన యెడల దానికి సంబంధించిన విస్తీర్ణం పై పేచీలు పెట్టరాదని,అది కౌలుదారుడే భరించాలన్నారు.ఏ కారణం చేతనైనా పాట రద్దు చేయుటకు గాని,వాయిదా వేయటం కానీ దేవస్థానం అధికారులకు అధికారం కలదని,మిగిలిన షరతులు పాట సమయంలో తెలుపబడునని వివరించారు.

# కాకినాడ 3వ బెటాలియన్ ఏపీఎస్పీ నందు శిక్షణలో ఉన్న పోలీస్ కానిస్టేబుళ్లకు సైబర్ క్రైమ్ మరియు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

గాయత్రి న్యూస్

జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ నందు శిక్షణ పొందుతున్న 300 మంది శిక్షణా పోలీస్ కానిస్టేబుళ్లకు హెల్మెట్ ఆవశ్యకత మరియు సైబర్ నేరాలు అనే అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ మరియు వీడియోల ద్వారా ఒక సమగ్ర అవగాహన కార్యక్రమాన్ని కాకినాడ ట్రాఫిక్ 1 ఇన్స్పెక్టర్ ఎన్ రమేష్ నిర్వహించారు. ఈ సదస్సులో మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారంతా సీట్ బెల్ట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాల తీవ్రతను వివరించారు. అలాగే జీబ్రా లైన్స్ లేని ప్రదేశాలలో రోడ్డు దాటే విధానం, ట్రాఫిక్ సైన్స్ ప్రాముఖ్యత, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణించరాదనే నియమాలతో పాటు, రోడ్డు



ప్రమాద బాధితులకు ప్రమాదం జరిగిన తేదీ నుండి 7 రోజుల వరకు వర్తించే రూ. 1,50,000 ఉచిత నగదు రహిత చికిత్స సౌకర్యం గురించి అవగాహన కల్పించారు. మహిళల భద్రత, ఈవ్ టీజింగ్ నివారణా చర్యలపై ప్రభుత్వం ప్రారంభించిన ఆపరేషన్ దండాయన గురించి వివరించారు. ప్రస్తుత సమాజంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలైన ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లోన్ యాప్స్, ఆన్‌లైన్ జాబ్స్, వర్క్ మోసాలు, డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా బాధితులు మరియు ప్రజలు తక్షణ సాయం కోసం, సమాచారం అందించడం కోసం సంప్రదించాల్సిన అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ల ఉద్దేశాలను వివరించారు. శాంతిభద్రతల సమస్యలు మరియు తక్షణ పోలీస్ సాయం కోసం 112 నంబర్‌ను, సైబర్ ఆర్థిక మోసాలకు గురైనప్పుడు వెంటనే ఫిర్యాదు చేసి డబ్బును కాపాడుకోవడానికి 1930 నంబర్‌ను, సమాజానికి పీడకలగా మారిన గంజాయి రవాణా, విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం ఇచ్చి పోలీసులకు సహకరించడం కోసం 1972 టోల్ ఫ్రీ నంబర్‌ను ఉపయోగించుకోవాలని ట్రైనీ కానిస్టేబుళ్లకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# సేవే మార్గం, స్మృతే ప్రేరణ.తోపాలచర్ల అనంతలక్ష్మి స్మృత్యర్థం

**- సేవే పరమావధిగా మజ్జిగ పంపిణీ, శాశ్వత చలివేంద్రం ప్రారంభించిన పాలచర్ల నాగేంద్ర చౌదరి**

గాయత్రి న్యూస్

పాలచర్ల అనంతలక్ష్మి జ్ఞాపకాలను సేవా సౌరభాలుగా మార్చుతూ, సమాజ హితమే ధ్యేయంగా మా ప్రియతమ నాయకులు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేస్తున్న ఆధ్యాత్మిక సామాజిక సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకుని మోహన్ సాయి కృష్ణ రెసిడెన్సీ వద్ద మానవీయ కార్యక్రమం చేపట్టడం జరిగింది అని అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పాలచర్ల నాగేంద్ర చౌదరి తెలియజేశారు. భానుడి భగభగలతో అలమటిస్తున్న పాఠశాల విద్యార్థులు, ప్రయాణికులు, స్థానిక ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ







కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.ఎండల తీవ్రత నుండి ప్రజలకు శాశ్వత ఉపశమనం కల్పించే సంకల్పంతో, 365 రోజులు అందుబాటులో ఉండేలా శీతల ఫిల్టర్ వాటర్‌తో కూడిన చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది అని ఆయన అన్నారు మనిషి జీవితంలో సేవాభావం కన్నా గొప్పది మరొకటి లేదు" అన్న పాలచర్ల అనంతలక్ష్మి మాటలే స్ఫూర్తిగా, ఆమె చూపిన మానవతా మార్గంలో నడవడం ఒక అదృష్టంగా భావిస్తున్నాం అని నాగేంద్ర చౌదరి అన్నారు ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. "మాతృదేవోభవ" అనే భావనను సజీవంగా నిలుపుతూ, అమ్మ జ్ఞాపకాలను సేవ రూపంలో కొనసాగించడం జీవితకాల బాధ్యత. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువవుతాం అని నాగేంద్ర చౌదరి తెలియజేశారు.

# కట్టెంపూడిలో విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు..

గాయత్రి న్యూస్

గుంటూరు జిల్లా, పొన్నూరు మండలం కట్టెంపూడి ప్రధాన రహదారిలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షం ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. ఈ నేపథ్యంలో గ్రామంలో గురువారం రాత్రి నుండి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామస్తులు విద్యుత్తు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పొన్నూరు రూరల్ విద్యుత్ శాఖ అధికారుల స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు...





# సిరిపురంలో టిడిపి నాయకుల ఆధ్వర్యంలో స్వర్గీయ ఎన్టీఆర్ 103వ జన్మదిన వేడుకలు

గాయత్రి న్యూస్

మేడికొండూరు మండల పరిధిలోని సిరిపురం గ్రామ సెంటర్లో ఉన్న స్వర్గీయ నందమూరి తారకరామారావు నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి ఆయనకు ఘన నివాళులర్పించారు. స్వర్గీయ నందమూరి తారకరామారావు 103వ జన్మదిన వేడుకలు సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని స్వర్గీయ ఎన్టీఆర్ 103వ జన్మదిన వేడుకలలో భాగంగా భారీ కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఇన్చార్జి మరియు సొసైటీ ప్రెసిడెంట్ కడియాల గణేష్ బాబు, తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు కడియాల హనుమంతరావు, గ్రామ సీనియర్ నాయకుడు మద్రిపూడి రాంబాబు, బాసాని రాజారెడ్డి, మరియు తదితర నాయకులు తో పాటు అభిమానులు ,కార్యకర్తలు , ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్చరీ కోచింగ్ క్యాంప్ ప్రారంభించిన బాబి



గాయత్రి న్యూస్

సాయి ఆర్చరీ అకాడమీ కోచింగ్ మాస్టర్ దేశినీడీ సాయిబాబు శుక్రవారం జి.ఎం.సి. బాలయోగి స్టేడియంలో పిల్లలకు కోచింగ్ క్యాంప్ ఏర్పాటు చేశారు. డి ఎస్ డి ఓ రుద్ర ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు వంటెద్దు బాబి హాజరై కొబ్బరికాయ కొట్టి కోచింగ్ క్యాంపు ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ ఆర్చరీ అకాడమీ ఏర్పాటుచేసి పిల్లలకు కోచింగ్ ఇస్తున్న మాస్టర్ సాయిని అభినందించారు. ఈ అవకాశాన్ని పిల్లలందరూ సద్వినియోగపరుచుకోవాలని దీని ద్వారా జిల్లా స్థాయి రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి వరకు పిల్లలు ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిఎంసి బాలయోగి స్టేడియం ఇన్చార్జ్. భీమేష్, వాగ్దేవి స్కూల్ పి.టి. తిక్కరెడ్డి శ్రీను, రాయి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా,కెరీర్ పై కిశోర బాలికలకు అవగాహన




గాయత్రి న్యూస్

క్రోసూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని పెదకూరపాడు ఎనిమిదవఅంగన్వాడీ సెంటర్లో శుక్రవారం కిషోర్ వికాసం కార్యక్రమం పై అవగాహన సదస్సు నిర్వహించారు.సూపర్వైజర్ పెద్ద హిమాంబి మాట్లాడుతూ కిశోర బాలికలకు రోజు విద్యా,కెరీర్ మార్గదర్శకాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్పి శివకుమారి,ఆశా కార్యకర్త విజయలక్ష్మి,అంగన్వాడి కార్యకర్త స్రవంతి,కిషోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ రోడ్లపైకి త్వరలో 750 ఎలక్ట్రిక్ బస్సులు.. కేంద్రమంత్రి పెమ్మసాని

గాయత్రి న్యూస్
గుంటూరు జిల్లా,ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా రవాణా వ్యవస్థను మరింత ఆధునీకరించే దిశగా కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశానికి కీలక అడుగులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి ౘ కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆర్టీసీ, ట్రాన్స్కో తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం పెమ్మసాని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు.ప్రధానమంత్రి ఎలక్ట్రిక్ బస్సు సేవ పథకం ద్వారా అందనున్న ఈ ఎలక్ట్రిక్ బస్సులకు గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో నిధులను అందిస్తున్నాయి. తద్వారా ఆంధ్రప్రదేశ్లోని 11 నగరాలకు ఈ ఎలక్ట్రిక్ బస్సులు మంజూరయ్యాయి. అందులో 12 మీటర్ల వైశాల్యంతో, 35౦1 సీటింగ్ గల బస్సులు 621, 9 మీటర్ల వైశాల్యంతో 25౦1 సామర్థ్యంతో మరో 129 బస్సులు, వెరసి 750 బస్సులను ఆంధ్రప్రదేశ్ కు తీసుకురాబోతున్నారు. ఎలక్ట్రిక్ బస్సుల వివరాలు, మౌలిక వసతుల ఏర్పాటు, ఛార్జింగ్ స్టేషన్లు, విద్యుత్ సరఫరా అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజలకు పర్యావరణహిత, సౌకర్యవంతమైన మరియు ఆధునిక రవాణా సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తున్నాయని సమావేశంలో పేర్కొన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ఈ ఎలక్ట్రిక్ బస్సులు ఉపయోగపడనున్నాయని అధికారులు అభిప్రాయపడ్డారు.అదేవిధంగా బస్సుల నిర్వహణకు అవసరమైన డిపోలు, ఛార్జింగ్ మౌలిక వసతులు, విద్యుత్ లోడ్ సామర్థ్యంపై ట్రాన్స్కో అధికారులు వివరాలు సమర్పించారు. త్వరితగతిన అన్ని ప్రక్రియలు పూర్తి చేసి, 2026 ఏడాది చివరికల్లా ఈ - బస్సులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు.నిధుల వివరాలు ఈ బస్సులకుగానూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందించబోవు నిధులలో గుంటూరు కు సంబంధించిన సివిల్ వర్క్ లకు రూ. 16.3 కోట్లు ఎలక్ట్రికల్ కు సంబంధించి రూ. 11.19 కోట్లు వెరసి గుంటూరుకు రూ. 27.49 కోట్లు మంగళగిరికి కేటాయించిన బస్సులలో సివిల్ వర్కులకు రూ. 9.24 కోట్లు, అలాగే ఎలక్ట్రికల్ వరకులకుగానూ రూ. 7.01 కోట్లు వెరసి రూ. 10.98 కోట్లు అందనున్నాయి.మంజూరైన బస్సుల వివరాలు 1. విశాఖపట్నం - 100 2.



విజయవాడ - 100 3. గుంటూరు - 100 4. నెల్లూరు - 100 5. కర్నూలు - 50 6. కాకినాడ - 50 7. రాజమహేంద్రవరం - 50 8. కడప - 50 9. అమరావతి - 50 10. తిరుపతి - 50 11. అనంతపురం - 50 మొత్తం - 750 రాష్ట్ర ప్రజా రవాణా రంగంలో ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని, భవిష్యత్తులో మరిన్ని గ్రీన్ మొబిలిటీ ప్రాజెక్టులకు ఇది మార్గదర్శకంగా మారుతుందని సమావేశంలో అభిప్రాయపడ్డారు.ఈ సమీక్ష సమావేశంలో ఏపీ సీపీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ యాదవ్ గారు, ఏపీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వి రవివర్మ ఏపీఎస్ఆర్టీసీ చీఫ్ ఇంజనీర్ వెంకటరమణ, గుంటూరు ఏపీసీపీడీసీఎల్ ఎస్సీ ఆపరేషన్స్ రమేష్ , ఏపీ ట్రాన్స్కో ఎస్ ఈ సి.హెచ్.ఎన్. వెంకట్రావు, ఏపీసీపీడీసీఎల్ ఎస్సీ సీఆర్డీఏ ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు...

# పుల్లూరు సీతారాంపురం తండాలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం

గాయత్రి న్యూస్
మైలవరం నియోజకవర్గం పుల్లూరు గ్రామ పంచాయితీ శివారు సీతారాంపురం తండా ప్రజల చిరకాల కోరిక నేడు నెరవేరింది.తండా వాసులకు సురక్షిత తాగునీరు అందించేందుకు నూతనంగా నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ స్వయంగా విచ్చేసి శుక్రవారం ఉదయం ప్రారంభించారు.కె.ఎల్ యూనివర్సిటీ యాజమాన్యం ఆర్వో యూనిట్ ఎక్విప్ మెంట్స్ అందించగా, గ్రామపంచాయతీ నిధులతో ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తయింది.1000 లీటర్ల కెపాసిటీ ట్యాంకుతో 122 కుటుంబాలకు సురక్షిత నీటి అవసరాలను తీర్చేందుకు ఈ ఆర్వో వాటర్ ప్లాంట్ నిర్మించారు.తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న తండా ప్రజలకు ఈ ప్లాంట్ ఎంతో మేలు చేస్తుందని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు అన్నారు.ఫ్లోరైడ్ రహిత స్వచ్ఛమైన తాగునీరు అందరి హక్కు అని, కూటమి ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.పేద, గిరిజన ప్రాంతాల అభివృద్ధే తమ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రతి ఇంటికీ సురక్షిత నీరు అందిస్తామని హామీ ఇచ్చారు.గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఆర్వో ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్లాంట్ నిర్వహణను గ్రామ పంచాయతీ జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు.తండా ప్రజలు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు కి పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు.చిరకాల కోరిక నెరవేర్చిన ఎమ్మెల్యే కి గ్రామ పెద్దలు, మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామస్తులు, మహిళలు పెద్ద





సంఖ్యలో పాల్గొన్నారు.

# నీటి గుంటలు, ఊబి ప్రదేశాల వద్ద అప్రమత్తంగా ఉండాలి.. కలెక్టర్

గాయత్రి న్యూస్
గుంటూరు జిల్లా,నీటి గుంటలు, ఊబి ప్రదేశాల వద్ద ప్రజలు ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు, యువత ఆట పాటలపై దృష్టి సారిస్తారని అన్నారు. ఇందులో భాగంగా ఈత వంటి కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొనే అవకాశాలు ఉంటాయని చెప్పారు. గ్రామ చెరువులు, దగ్గరలో ఉన్న సరస్సులు, వాగులు, వంకలుతో సహా క్వారీ తవ్వకాలు చేపట్టిన తరువాత నీటి గుంటలుగా ఏర్పడతాయని అటువంటి ప్రదేశాల్లో లోతు ఎక్కువగా ఉండే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. క్వారీ గుంటల వద్ద నీటిలో దిగుటకు అనువుగా ఉండదని, లోతైన ప్రాంతాలుగా ఉండే అవకాశాలు ఉంటాయని ఇటువంటి ప్రదేశాల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన తీసుకోవాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, సెలవులు కావడంతో పిల్లల ఆటపాటపై మనస్సు లగ్నం చేస్తారని వారి కార్యకలాపాలపై దృష్టి సారించాలని సూచించారు. లోతైన, తెలియని నీటి నిల్వ ప్రదేశాలు దిశగా వెళ్లకుండా ఒక కంట కనిపెట్టాలని అన్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటం వలన ఈతకు వెళ్ళుటకు ఎక్కువ ఆసక్తి చూపించే అవకాశం ఉందని చెప్పారు. పశువులను స్నానాలకు కూడా తీసుకువెళ్లడం, నీరు తాగించుటకు తీసుకువెళ్ళడం జరుగుతుందని తెలిపారు. చెరువులు, నీటి గుంటలు, కాలువలు ఇతర నీటి నిలువ ప్రదేశాలు, ఊబి ఉండే ప్రదేశాలను గుర్తించి వాటి వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అటు ప్రక్కగా ఎవరు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ, రెవెన్యూ శాఖలను ఆదేశించారు.
అనుమతి లేని క్వారీలు పైనా దృష్టి సారించాలని ఆదేశించారు. ఎటువంటి దుర్ఘటన జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. క్వారీలకు అనుమతులు మంజూరు చేసినప్పుడే వాటి నిర్వహణ పట్ల స్పష్టమైన నిబంధనలు జారీ చేయాలని గనుల శాఖను ఆదేశించారు. రహదారి ప్రక్కన లేదా జనం సమూహ ప్రాంతాల్లో మరిన్ని మెరుగైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటువంటి



తెలియని నీటి నిల్వ ప్రదేశాలు, లోతైన, ప్రమాదకరమైన ప్రదేశాల సమాచారం ఉంటే స్థానిక గ్రామ పంచాయతీ, రెవెన్యూ, స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సిబ్బందికి తెలియజేయాలని కోరారు. అకాల వర్షాలు, గాలుల సమయంలో హోర్డింగ్స్, చెట్లు క్రింద ఉండరాదు.అకాల వర్షాలు, గాలుల సమయంలో హోర్డింగ్స్, చెట్లు క్రింద ఉండరాదని జిల్లా కలెక్టర్ ప్రజలను కోరారు. పిడుగుపాటు వంటి సమయంలో చెట్లు క్రింద ఉండటం మరింత ప్రమాదకరమని, విద్యుదాఘాతం సంభవించవచ్చని అన్నారు...

# పెద్దనాపల్లి -చిన్నింపేట బీటీ రోడ్డు పనులు పరిశీలించిన ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

గాయత్రి న్యూస్
ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చొరవతో పెద్దనాపల్లి నుండి చిన్నింపేట వరకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి.ఈ నిర్మాణ పనులను కాకినాడ జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు,ఏలేశ్వరం మండల ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి స్వయంగా పరిశీలించారు.రోడ్డు పనుల నాణ్యత,నిర్మాణ వేగం,ప్రజలకు కలిగే ప్రయోజనాలపై ఆర్‌డబీ అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలు మెరుగుపడటంతో ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డబీ అధికారులు,నాయకులు సుంకర సత్య నారాయణ,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బక్రీద్ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి ముస్లిం సోదరుల ఆత్మీయ పలకరింపు

శ్రీకాళహస్తి, మే 29,గాయత్రి న్యూస్ :రిపోర్టర్ : రంజిత్
శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ని ముస్లిం సోదరులు మర్యాదపూర్వకంగా కలిసి బక్రీద్ పండుగ శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు దుశ్శాలవాతో



సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ ఉపాధ్యక్షులు షేక్ మస్తాన్, శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ ఎండి షఫీ, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు షేక్ ఖాదర్, నియోజకవర్గ మైనారిటీ ఉపాధ్యక్షులు షేక్ షఫీ, 16వ వార్డు అధ్యక్షుడు షేక్ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శు భాకాంక్షలు తెలియజేస్తూ, సోదరభావం మరియు సామరస్యానికి బక్రీద్ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# పసుపు జెండాలతో రెపరెపలాడిన మహానాడు -2026

శ్రీకాళహస్తి, మే 29, గాయత్రి న్యూస్ :రిపోర్టర్ : రంజిత్



పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా స్వర్గీయ ఎన్టీ రామారావు స్థాపించిన తెలుగు దేశం పార్టీ ప్రతి మహానాడుతో మరింత నూతనోత్తేజంతో పేదల సేవకు పునరంకితం అవుతోందని శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ నాయకులు పేర్కొన్నారు.అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుతో నెల్లూరులో నిర్వహించాల్సిన మహానాడు--2026ను హైబ్రిడ్ విధానంలో ఘనంగా నిర్వహించడం టీడీపీ ప్రత్యేకత అని తెలిపారు. సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకోవడం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రతి కార్యకర్తకు నేర్పారని, అదే స్ఫూర్తితో హైబ్రిడ్ మహానాడును విజయవంతం చేశారని కొనియాడారు.గతంలో ఒకే వేదికకు పరిమితమైన మహానాడు, ఈసారి "తెలుగుదేశం -- నా బాధ్యత" నినాదంతో ప్రతి గ్రామం, ప్రతి ఇంటికీ చేరిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్ల బాధ్యతలను కార్యకర్తలే తీసుకుని మహానాడు--2026ను కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేశారని తెలిపారు. సహకరించిన ప్రతి టీడీపీ కుటుంబ సభ్యుడికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన తీర్మానం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందని, "స్త్రీ శక్తి" థీమ్‌కు మహానాడు నిజమైన అర్థం చెప్పిందన్నారు. "కార్యకర్తలే అధినేత" అనే నినాదాన్ని కార్యరూపంలో చూపించిన మహానాడు చరిత్రలో నిలిచిపోతుందని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డా. జి. దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. యం. ఉమేష్ రావు, తంగేళ్లపాలెం పీఏసీఎస్ ఛైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, నాయకులు గంగనపల్లి రమేష్, సులేమాన్, కృష్ణమూర్తి, మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సందీప్ వంగా సినిమాల్లో హీరోయిన్స్ గ్లామర్‌కే పరిమితం కాదు : దర్శకుడు హేమంత్ మధుకర్



సందీప్ వంగా దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'స్పిరిట్' తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా షూటింగ్‌లో త్రిప్తి డిమ్రీ జాయిన్ అయ్యారు. అయితే ఆమె పాత్ర గ్లామర్‌కే పరిమితం అవుతుందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మరో డైరెక్టర్ హేమంత్ మధుకర్ స్పందిస్తూ.. సందీప్ వంగా సినిమాల్లో హీరోయిన్ క్యారెక్టర్లు చాలా బలంగా ఉంటాయని అన్నారు. త్రిప్తి పాత్ర ప్రేక్షకులను కచ్చితంగా ఆశ్చర్యపరుస్తుందని పేర్కొన్నారు.

"సందీప్ రెడ్డి వంగా మహిళా పాత్రలను రాసే విధానాన్ని ప్రేక్షకులు తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. ఆయన సినిమాల్లోని కొన్ని ఇంటిమేట్ సీన్స్ చూసి, హీరోయిన్‌కు కేవలం గ్లామర్ పాత్రలే ఇస్తారని అనుకుంటారు. కానీ మీరు నిశితంగా పరిశీలిస్తే.. సందీప్ మహిళలకు చాలా బలమైన, వైవిధ్యమైన పాత్రలను ఇస్తారు. 'అర్జున్ రెడ్డి' సినిమాలో శాలిని పాండే పాత్రను చూస్తే.. ఆమె ఎక్కువగా సింపుల్ కాస్ట్యూమ్స్‌లోనే కనిపిస్తూ చాలా హోమ్లీ ఇమేజ్‌తో ఉంటుంది. కానీ ఆ క్యారెక్టర్‌లో ఎంతో ఎమోషన్ ఉంది. అలాగే 'యానిమల్' సినిమాలో రష్మిక పాత్రను గమనిస్తే.. భర్తకు, కుటుంబానికి మధ్య జరిగే ఘర్షణలను తట్టుకునే ఒక బలమైన భార్యగా చూపించారు. 'యానిమల్' హీరో సెంట్రిక్ ఫిల్మ్ అయినప్పటికీ రష్మిక తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు" అని హేమంత్ అన్నారు.

"హీరో, హీరోయిన్, విలన్.. ఇలా అందరి పాత్రలను సమానంగా, పవర్‌ఫుల్‌గా రాయడంపైనే సందీప్ వంగా దృష్టి పెడతారు. ఇక 'స్పిరిట్' సినిమాలో దీపికా పదుకొణె స్థానంలో త్రిప్తి వచ్చారనే వార్తలను నేను పట్టించుకోను. ఈ రోజుల్లో దర్శకులు వారు రాసుకున్న పాత్రకు ఎవరు సరిపోతారో చూసి ఎంపిక చేసుకుంటారు. త్రిప్తి కచ్చితంగా అందరి అంచనాలను అందుకుంటారని నేను నమ్ముతున్నాను" అని హేమంత్ అన్నారు.

# నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చేసిన ధనుష్ కర




కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన లేటెస్ట్ హీస్ట్ థ్రిల్లర్ మూవీ 'కర' తాజాగా ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. విఘ్నేష్ రాజా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం థియేటర్లలో విడుదలైనప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రేక్షకాదరణ పొందలేకపోయింది. మంచి అంచనాల మధ్య రిలీజ్ అయిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మాత్రం పెద్దగా ప్రభావం చూపించలేకపోయింది. ఇప్పుడు ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ నెట్‌ఫ్లిక్స్‌లో డిజిటల్ స్ట్రీమింగ్ జరుపుకుంటుంది. తమిళంతో పాటు తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ఈ సినిమా అందుబాటులోకి వచ్చింది. అలాగే ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో కూడా స్ట్రీమింగ్ అవుతోంది. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఓటీటీలో ఈ సినిమాను వీక్షించే అవకాశం దక్కింది.

'కర' సినిమాలో ధనుష్ తనదైన స్టైల్‌లో ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకునే ప్రయత్నం చేశాడు. హీస్ట్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో సస్పెన్స్, యాక్షన్, ఎమోషనల్ ఎలిమెంట్స్‌ను మిళితం చేస్తూ దర్శకుడు విఘ్నేష్ రాజా కథను రూపొందించారు. అయితే కథనం నెమ్మదిగా సాగడం, స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను పూర్తిగా ఎంగేజ్ చేయలేకపోవడం వంటి కారణాలతో థియేటర్లలో ఈ సినిమా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ చిత్రంలో 'ప్రేమలు' ఫేమ్ మమితా బైజు హీరోయిన్‌గా నటించింది. ధనుష్‌తో ఆమె కెమిస్ట్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే ప్రముఖ నటులు సూరజ్ వెంజరామూడు, కేఎస్ రవికుమార్, జయరామ్ కీలక పాత్రల్లో కనిపించారు. వీరి నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. ముఖ్యంగా థ్రిల్లింగ్ సన్నివేశాల్లో ఆయన సంగీతం సినిమాకు మరింత ఉత్కంఠను తీసుకువచ్చింది.



# ఈ ప్రయాణంలో మీకు మీరే స్నేహితులు

కళా రంగమే కాదు.. మీరు ఎంచుకున్న ఏ ప్రపంచంలోనైనా మీ ప్రయాణం వ్యక్తిగతమైనదే అంటోంది కథానాయిక ఐశ్వర్య రాయ్. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె చిత్రపరిశ్రమలో రాణించాలనుకున్నప్పుడు వ్యక్తిత్వానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత గురించి తన అభిప్రాయాన్ని పంచుకుంది. "నటిగా ఇప్పటికీ ప్రతిరోజు కొత్తగానే భావిస్తాను. సృజనాత్మకతతో కూడిన ఈ ప్రపంచంలో మనల్ని మనం వెతుక్కునే నిరంతర ప్రయాణం ఇది. అలాంటిది ఎవరికో సలహాలు ఇచ్చేంత గొప్ప స్థానంలో నేను ఉన్నానని అనుకోను. ప్రేక్షకులు నాపై చూపే ప్రేమ, ఆదరాభిమానాలకు ఎల్లప్పుడూ కృతజ్ఞురాలినే. కానీ, కళా రంగమే కాదు.. ఎంచుకున్న ఏ ప్రపంచంలోనైనా మీ ప్రయాణం వ్యక్తిగతమైనది. మీ అనుభవాలే మీకు జీవితంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోగలరో తెలుసుకునేందుకు సహాయపడతాయి. ఎందుకంటే ఒక్కొక్కరిది ఒక్కో రకమైన దృష్టి కోణం. నేను చెప్పాలని అనుకున్నదల్లా ఒక్కటే.. ఇప్పుడున్న పరిస్థితుల్లో మీ చుట్టూ ఏం జరుగుతుందో మీరు ఊహించలేరు. ప్రతి విషయాన్ని ఒక ప్రణాళికతో కృత్రిమంగా చేయడానికే ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. నిజమో కాదో తెలుసుకునేలోపే అంతా జరిగిపోతుంది. యువతరం ఇలాంటి వాటిని చూసి పక్కదారి పట్టకూడదు. బయటకు వెళ్లండి. మీ అభిరుచిని తెలుసుకోండి. మీ నిర్ణయాలతో నిజాయతీగా మెలగండి. ఆ ప్రయాణంలో మీకు మీరే మంచి స్నేహితులుగా నిలబడాలి. ఈ నకిలీ ప్రపంచంలో ఫన్, మ్యాజిక్‌లతో పాటు ఒక వ్యక్తి ఏం చేయగలడో అనే వాటిని అన్వేషించేదంలో ఆనందం ఉండదు. ముందు సజీవంగా ఉండి జీవితాన్ని అర్థం చేసుకోవాలి. ఆ తర్వాత ఆ అనుభూతిని మీ కళలోకి తీసుకురావాలి. మీరు ఎవరనే దానికి నిజాయతీగా ఉండండి. అలానే నిత్య విద్యార్థిగా ఉంటూ మీతో మీరు నిజాయతీగా ఉండండి. సొంత అనుభవాలే మిమ్మల్ని ఒక మంచి నటుడిగా తీర్చిదిద్దుతాయి. వాటన్నింటినీ స్వీకరిస్తూ మీ ప్రయణాన్ని సాగించాలి. మిగిలినవన్నీ జరగాల్సిన సమయానికి అవే జరిగిపోతాయి, రావాల్సినవి వస్తాయి" అని చెప్పింది.

# ఇదంతా పబ్లిసిటీ కోసం కాదు!

వేరే పరిశ్రమకి వెళ్లినప్పుడు అక్కడి స్థానిక భాష మాట్లాడటం చాలా ముఖ్యమని, ఇదంతా పబ్లిసిటీ కోసం కాదని అంటోంది అందాల తార శ్రీలీల. భాషతో సంబంధం లేకుండా ప్రేక్షకుల్ని అలరించే ఈ భామ.. తన డ్యాన్స్‌తో కుర్రకారుని ఉర్రూతలూగిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె వివిధ ప్రాంతాల ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వడం గురించి మాట్లాడింది. "నా విషయానికొస్తే... నేను ప్రతి భాషను గౌరవిస్తాను. పలు చిత్రపరిశ్రమల్లో అవకాశాలు అందుకుంటూ పనిచేస్తున్నా... కాబట్టి ఒక ప్రాంతానికి వెళ్లినప్పుడు తప్పకుండా అక్కడి భాషలోనే మాట్లాడతా. ఆ ప్రదేశానికి, అక్కడి భాషకు, ప్రజలకు ఇచ్చే గౌరవం అది. సినీతారలకు, ప్రేక్షకులకు మధ్య భాష ఒక భావోద్వేగ వారధిలాగా ఉంటుంది. అందుకే ప్రచార కార్యక్రమాల్లో స్థానిక భాషల్లో మాట్లాడటం వల్ల వారి మధ్య దూరం తగ్గుతుందనేది నా అభిప్రాయమ"ని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె హిందీలో కార్తిక్ ఆర్యన్‌తో ఓ ప్రేమకథా చిత్రంతో పాటు ధనుష్ నటిస్తున్న మరో సినిమాలో నాయికగా నటిస్తుంది.



# సింగిల్ మదర్‌గా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా

## మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్

24 ఏళ్ల వయసులో పెద్ద కుమార్తె రెనీని దత్తత తీసుకున్నప్పుడు ఎదుర్కొన్న విమర్శలను, ఇబ్బందులను బాలీవుడ్ నటి, మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్ తాజాగా గుర్తుచేసుకుంది. ఒక సింగిల్ మదర్‌గా తల్లి కావాలనే తన నిర్ణయం వల్ల కెరీర్ ముగిసిపోతుందని అందరూ భావించారని, చివరికి తన మేనేజర్ కూడా తనను వదిలేసి వెళ్లిపోయాడని ఆమె పేర్కొన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సుస్మితా సేన్ మాట్లాడుతూ.. 'నేను రెనీని దత్తత తీసుకున్నప్పుడు నా మేనేజర్ నన్ను వదిలి పారిపోయాడు. 'నీకు కెరీర్ పట్ల సీరియస్ నెస్ లేదు.. 24 ఏళ్లకే తల్లి అయిన వ్యక్తికి నేను మేనేజర్‌గా ఉండలేను' అని చెప్పాడు. అంతేకాదు, ఇకపై నాకు హీరోయిన్‌గా అవకాశాలు రావని, కేవలం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గానే మిగిలిపోతానని చాలామంది హెచ్చరించారు అని సుస్మితా చెప్పుకొచ్చింది. అయితే తనకు పరిశ్రమ నుంచి ఎలాంటి మద్దతు లభించనప్పటికీ, మాతృత్వమే తనను మరింత బలోపేతం చేసిందని సుస్మితా చెప్పారు. కూతురు వచ్చిన తర్వాతే నా కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్ సినిమాలు ఇచ్చాను. రెనీని దత్తత తీసుకున్న తర్వాత 'ఆంఖే', 'మై హూ నా', 'మైనే ప్యార్ క్యూ కియా' వంటి సూపర్ హిట్ చిత్రాల్లో నటించాను. ఇటీవలి కాలంలో 'ఆర్య' వెబ్ సిరీస్, 'తాలి' బయోపిక్‌లతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై కూడా తన నటనతో అలరించాను అంటూ సుస్మితా చెప్పుకొచ్చింది. ఇక సుస్మితా



సేన్ జీవితంలో మాతృత్వానికి ఎప్పుడూ మొదటి స్థానమే ఉంటుంది. 2010లో ఆమె 'అలీషా' అనే మరో అమ్మాయిని కూడా దత్తత తీసుకున్నారు. వీరిద్దరితో కలిసి తనదైన ఒక అందమైన ప్రపంచాన్ని నిర్మించుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. సుస్మితా పెద్ద కుమార్తె రెనీ కూడా ప్రస్తుతం యాక్టింగ్ రంగంలోకి అడుగుపెట్టారు. భయం లేకుండా, ఒదిగి ఉండటాన్ని తన తల్లి నుంచే నేర్చుకున్నానని రెనీ పలు సందర్భాల్లో చెప్పారు. 1994లో మిస్ యూనివర్స్ కిరీటాన్ని గెలుచుకున్న తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించిన సుస్మితా సేన్, ఆ తర్వాత తన వ్యక్తిగత నిర్ణయాలపై వచ్చిన విమర్శలను ఏమాత్రం లెక్కచేయకుండా, అనుకున్నది సాధించి ఎందరికో ఆదర్శంగా నిలిచారు.

**GAYATHRI NEWS Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/26/A3646 .. Cell No - 7386045673 ..... Printed ESHAGNA SERVICE INDIA PRIVATE LIMITED
SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.